

వాల్‌పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మహిళల కొరకు మహిళల హక్కులు, ఆరోగ్యం- పరిశుభ్రతపై ఎస్వీయూ హెల్త్ సెంటర్, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో 22 నవంబర్ 2024 మధ్యాహ్నం రెండు గంటలకు సదస్సు నిర్వహించబడుతుందని వర్సిటీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతినాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికను వీసీ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సదస్సును ముఖ్యంగా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో ముఖ్యంగా మహిళల హక్కులు మహిళల ఆరోగ్యం, వారి పరిశుభ్రతలపై చర్చ ఉంటుందని తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనే వారు ముందుగా నమోదు చేసుకోవాలని, ఇందుకొరకు వర్సిటీలో హెల్త్ సెంటర్ అన్నమయ్య భవనలో సంప్రదించాలని నిర్వాహకులు కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ అలేఖ్య కోరారు. కార్యక్రమంలో ఆచార్యులు వూకా రమేష్, ప్రయాగ, డాక్టర్ హరికృష్ణ, నాథముని పాల్గొన్నారు.

ట్యాంకుల సుందరీకరణ పనులు పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలోని పలు ట్యాంకులు (కుంటలు) సుందరీకరణ పనులను ప్రాధాన్యతగా తీసికొని యుద్ధప్రాతిపదికన పనులను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో తిరుపతి నగరంలోని వివిధ ట్యాంకర్ల సుందరీకరణ పనుల పురోగతిపై చంద్రగిరి ఎంఎల్‌ఏ పులివర్తి నాని, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఆర్‌డిఓ తిరుపతి రామ్మోహన్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, డీపీఓ సుశీలమ్మ సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నీటి వనరులను అభివృద్ధి చేయడానికి ట్యాంకుల పునరుద్ధరించడం కోసం సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా వినాయకసాగర్, పాన్ చెరువు, గొల్లవాని గుంట, కోరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కాగా స్మార్ట్ సిటీలో భాగంగా వినాయకసాగర్, గొల్లవాణి గుంట ఇప్పటికే అభివృద్ధి చేశారని, మిగిలిన వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే తుడా అవిలాల చెరువు అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి, చంద్రగిరి ఎమ్మెల్యే

పెడదారి పడుతున్న యువత

- క్రమేపీ మత్తులోకి జారుకుంటున్న వైనం
- విచ్చలవిడిగా మాదకద్రవ్యాల విక్రయాలు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం)

నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు అని గొప్పగొప్ప నాయకులు సభలలో చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో మన దేశ యువత మత్తుకు బానిస అవుతోందన్న చేదు నిజాన్ని సమాజంలోని ఎంతో మంది తల్లిదండ్రులు జీర్ణించుకో లేకపోతున్నారు. అల్లారుముద్దుగా కనిపెంచిన బిడ్డ ఈ విధంగా కళ్ళ ఎదుటే మత్తుకి బానిసై, వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నాడని మనోవేదనతో కుమిలిపోయే ఎంతోమంది తల్లిదండ్రులు మన కళ్లముందు కూడా ఉండనే ఉన్నారు. కాసుల వేటలో కొందరు చేస్తున్న ఈ వికృత వ్యాపారానికి బంగారు భవిష్యత్తు కలిగిన యువత నాశనం అవుతోంది. కట్టడి చేయాల్సిన యంత్రాంగాలు నిశ్చేష్టలుగా చూస్తున్నాయన్న విమర్శలు లేకపోలేదు. రాజకీయ ఒత్తిళ్లు కావచ్చు.. మరి ఇతర కారణాలు కావచ్చు.. ఉజ్వల భవిష్యత్తు కలిగిన యువతను సన్మార్గంలో నడపాల్సిన బాధ్యత వారిపై కూడా ఉందన్న విషయాన్ని ఇకనైనా గుర్తు తెరగాలి. లేకుంటే నేరాలను అదుపు చేయలేని పరిస్థితికి సమాజం వెళ్లిపోతుందన్న నిజాన్ని గుర్తించాలి.

లక్షల మంది తిరుమల శ్రీవారి దర్శనార్థం మొదటగా అడుగు పెట్టేది తిరుపతి నగరంలోనే. ఆధ్యాత్మికతతో... గోవింద నామస్మరణలతో నిరంతరం మారుమ్రోగి తిరునగరిలో ఇటువంటి మత్తు పదార్థాల వినియోగం, అమ్మకాలపై శ్రీవారి భక్తులతో పాటు... దేశ విదేశాల నుండి వచ్చి యాత్రికులు పెదవి విరిచే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో ఇలాంటి పరిస్థితులను మునుపన్నడు చూడలేదని, దీన్ని కట్టడి చేయాల్సిన అధికార యంత్రాంగంపై విమర్శలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. మత్తు పదార్థాల అమ్మకాలను రాజకీయం చేయడం కాకుండా.. వాటిని సమూలంగా కూకటి వేళ్లతో పెకలించి యువత భవిష్యత్తును కాపాడాల్సిన తరుణం ఇది. తిరుపతి నడిబొడ్డున శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయం వెనుక ఉన్న ప్రాంతంలో విచ్చలవిడిగా మత్తు పదార్థాల అమ్మకాలు సాగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం మత్తు పదార్థాలను అమ్మకాలు చేస్తుండగా ఈ చిత్రాలు కనిపించాయి. ఫోటోలు తీస్తుండగా యువత అక్కడి నుండి శరవేగంతో వెళ్లిపోయారు. ఇకనైనా బాధ్యత కలిగిన యంత్రాంగాలు తమ వంతు బాధ్యతను సమాజంలో పెడదారి పడుతున్న యువతను మంచి మార్గంలో నడపడానికి కృషి చేస్తారని ఆశిద్దాం..

విశ్వం విద్యాసంస్థలకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి- క్యాంపస్

జాతీయ స్థాయిలో తిరుపతి విశ్వం విద్యాసంస్థలకు 'ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్ – 2024' అవార్డ్‌ను బెంగళూరులోని హోటల్ తాజ్‌లో ప్రముఖ బాలీవుడ్ నటి ఆదాశర్మ చేతుల మీదుగా విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా మై బ్రాండ్ బెటర్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ జాతీయస్థాయిలో గత 34 సంవత్సరాలుగా తిరుపతి విశ్వం విద్యాసంస్థలు స్కూల్ సిలబస్‌తో పాటు సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉత్తమ శిక్షణ ఇస్తూ జాతీయస్థాయిలో అత్యుత్తమ ఫలితాలను, మార్కులు, ర్యాంకులను విశ్వం సాదిస్తునందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు, 1000 పైగా సీట్లు సాధించి రికార్డు సృష్టించారని, విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాట వేస్తూ విద్యయే ప్రథమ ధ్యేయంగా బోధిస్తూ ఇంతటి ఘన విజయలు సాధిస్తునందకు ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ద ఇయర్ – 2024 అవార్డును ప్రదానం చేసి అభినందించారని తెలిపారు.

ఎస్వీయూలో ఎంఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో ఎంఫార్మసీ కోర్స్ కోసం నవంబర్ 21,2024 వరకు ఏపీపీజీఈసెట్ –2024 ఫార్మసీలో అర్హత సాధించిన వారు మాత్రమే అప్లై చేసుకోవాలనీ వర్సిటీ రిజిస్ట్రరార్ ఆచార్య భూపతి నాయుడు, డిఓఏ డైరెక్టర్ ఆచార్య వూకా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్స్ ఫీజు 1,28,940 రూపాయలని, మరిన్ని వివరాలకు www.svuniversity.edu.in/doa వెబ్‌సైట్ సందర్శించాలని తెలిపారు. ఈ ఎం.ఫార్మసీ ప్రవేశ ప్రక్రియ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ చేపడుతుందని వారు అన్నారు.

పారిశ్రామిక, పర్యావరణశాఖ

అభివృద్ధి కోసం భూముల సేకరణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: పారిశ్రామిక, పర్యావరణ శాఖ అభివృద్ధి కోసం భూముల సేకరణ పక్రియను త్వరితగతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ పారిశ్రామిక, పర్యావరణశాఖ అభివృద్ధికి భూముల సేకరణ ప్రక్రియపై మున్సిపల్ కమిషనర్ మౌర్య, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవోలు, రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని పారిశ్రామిక, పర్యావరణశాఖ అభివృద్ధికి తిరుపతి నగర పరిధి, రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌లో ప్రభుత్వ భూములు, ఇతర భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు భూముల వివరాలను తెలపాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ నవజాత శిశు వారోత్సవాల ర్యాలీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : ఎస్వీ వైద్య కళాశాల చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో నవజాత శిశు వారోత్సవాలను రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు ప్రారంభించారు. చిన్నపిల్లల విభాగవతి డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొని ఔషధాలు వాటి వాడకం గురించి, చిన్నపిల్లలకు యాంటీబయాటిక్ మోతాదు తగ్గించడం, తల్లులు, వైద్యులు, నర్సింగ్ వారి పాత్ర గురించి తెలియజేశారు. చిన్నపిల్లల విభాగం నుండి ప్రసూతి ఆసుపత్రి మీదుగా రుయా ఆసుపత్రి వరకు అవగాహన ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వలన చిన్నపిల్లల సంరక్షణ, తల్లుల పాత్ర అనే అంశం మీద అవగాహన కలిగించినట్లయితే, నవజాత శిశువును కాపాడుకోవడంలో ముఖ్యపాత్ర వహించడానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరమని తెలిపారు. చిన్నపిల్లల ప్రొఫెసర్ డాక్టర్ కిరీటి, డాక్టర్ అంజన్ కుమార్, చిన్నపిల్లల విభాగ వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం)

108 ఉద్యోగులు తమ డిమాండ్ సాధనలో భాగంగా ప్రభుత్వానికి వివిధ రూపాలలో నిరసన తెలియజేస్తున్నారు. మంగళవారం 108 వాహనాలకు 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి అనే స్టిక్కర్‌ను వాహనం ముందు, వెనుక భాగాలలో అంటించి ప్రజల సేవకు నడిపించారు.

భూ సేకరణ పనులు వేగవంతం చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నేషనల్ హైవే పీడీలు, రైల్వేశాఖ ఈఈ, ఏఈలు, తహశీల్దార్లతో భూ సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలపై జాతీయ రహదారి, రైల్వేశాఖ, రెవెన్యూ సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని, అలసత్యం చర్యలు తప్పవని అన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణపనులు పురోగతిలో ఉండాలని తెలిపారు. కాలూరు–పీలేరు, రేణిగుంట –నాయుడుపేట గూడూరు, సూళ్లూరుపేటకు సంబంధించిన సాగరమాల రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. భూసేకరణ విషయంలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలని, ముఖ్యంగా రహదారుల నిర్మాణంలో ఎటువంటి జాప్యము లేకుండా పనులు పూర్తి కావాలని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు ఎప్పటికప్పుడు ఎన్‌హెచ్ అధికారులతో సమన్వయం చేసుకొని రహదారుల పనులు పురోగతిలో ఉండేలా చూడాలని తెలిపారు.

భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు

మహిళలు పింక్ టాయిలెట్లు వినియోగించుకోవాలి: కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: మహిళల కోసం ఏర్పాటు చేసిన పింక్ టాయిలెట్లు మహిళలు వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మహిళలకు పిలుపునిచ్చారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ (వరల్డ్ టాయిలెట్స్ డే) కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పింక్ టాయ్లెట్, శ్రీనివాసం వద్ద నున్న మరుగుదొడ్లను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ నగరంలో మహిళల కోసం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రత్యేకంగా పింక్ టాయిలెట్ ఏర్పాటు చేశామని అన్నారు. అయితే మహిళలు ఈ పింక్ టాయిలెట్‌ను సరిగా వినియోగించుకోవడం లేదన్నారు. ఇందులో మరుగుదొడ్లతో పాటు పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా గది ఏర్పాటు చేశామని మహిళలు ఉచితంగా వినియోగించుకోవచ్చని అన్నారు. నగరంలో కూడా పలు చోట్ల నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని, అందులో వినియోగంలో లేని వాటిని తొలగిస్తామన్నారు. ప్రజలకు అవసరమైన చోట ఏర్పాటు చేసేలా ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశామని, ఆయా ప్రాంతాల్లో ప్రజల అవసరాలను బట్టి మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఎక్కడంటే అక్కడ వెళ్ళలేరు వెళ్ళలేరు కాబట్టి వారికోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని వాటిని వినియోగించుకోవాలని అన్నారు. నగరంలో ఉన్న అన్ని మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు.

'మా స్థలాన్ని కాపాడండి'

మీడియా ముందు బాధితుల ఆవేదన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: కబ్జాదారుల నుంచి తమ ఇంటి స్థలాలకు రక్షణ కల్పించాలి అంటూ తిరుపతికి చెందిన ఉషారాణి వేడుకుంటున్నారు. తిరుపతి మార్కెట్ వద్ద మంగళవారం బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ తిరుపతి రూరల్ ప్రాంతంలోని కేఆర్ నగర్ వాసులు 2007లో సర్వేనెంబర్ 249/4, 249/5లో తుడా అప్రూవల్ లేఔట్ కింద దాదాపు 22మంది హరినాథ్ రెడ్డి అనే వ్యక్తి ద్వారా రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిపారు. అప్పటినుంచి కూడా ఈ స్థలాలు మొత్తం తమ స్వాధీనంలోనే ఉందని, ఈ మధ్యకాలంలో తుంగ బాలకృష్ణ అనే వ్యక్తి ఈ స్థలాలు నాదంటూ మమ్మల్ని బెదిరిస్తున్నారని వాపోయారు. గత ప్రభుత్వహయాంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరు చెప్పి బలవంతంగా తమ స్థలాలలో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించారని, ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో తిరిగి ఇంటి స్థలంలో నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో తుంగా బాలకృష్ణ తన అణుచరుల ద్వారా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, తనకు రాజకీయ పలుకుబడి ఉందని తిరుపతి ఎమ్మెల్యే, ఆయన అన్న కుమారుడు శివ, జిల్లా ఎస్పీ పేర్లను చెబుతూ తుంగ బాలకృష్ణ తమని బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ తమకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌విఎంసి విద్యార్థులకు అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఎస్వీ వైద్య కళాశాల, భువన విజయం ఆడిటోరియంలో విభాగాధిపతిగా, ఎస్‌వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ ఏవిఎస్ఎస్ రామారావు, జ్ఞాపకార్థంగా ఎస్వీ వైద్య కళాశాల బయో కెమిస్ట్రీ విభాగం విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. మంగళవారం స్థానిక భువన విజయం ఆడిటోరియంలో ఏవీఎస్ రామారావుకు వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, వారి కుటుంబ సభ్యులు డాక్టర్ సూర్యలక్ష్మి, డాక్టర్ రమణ మూర్తి, బయో కెమిస్ట్రీ విభాగంలో విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ ఏవిఎస్ఎస్ రామారావు కృషి ఫలితాలుగా వైద్యంలో పేద రోగులకు, ఎనలేని వైద్యసేవ అందించడం జరిగిందన్నారు. బయో కెమిస్ట్రీ విభాగధిపతి డాక్టర్ మాధవీలత అధ్యక్షతన వహించారు. రిటైర్డ్ మానసిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పద్మ సుధాకర్, జనరల్ సర్జరీ నుంచి డాక్టర్ హరిహర శాస్త్రి, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ బిఎస్ఎన్.మూర్తి, డాక్టర్ సునీత, విభాగ వైద్యులు వైద్య విద్యార్థులు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఏటుకూరి గిరిబాబు, జిల్లా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు సురేష్ బాబు, బయో కెమిస్ట్రీ విభాగ పారామెడికల్ సిబ్బంది, ఎస్‌వి వైద్యకళాశాల పిఆర్‌ఓ వీరకిరణ్ పాల్గొన్నారు.

కదిలిన రెవెన్యూ యంత్రాంగం

చోడవరం శ్మశాన దారిపై సమగ్ర సర్వే

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలంలోని చోడవరం గ్రామ శ్మశాన దారి సమస్యపై రెవెన్యూ అధికారుల్లో చలనం వచ్చింది. ఆ గ్రామ శ్మశాన దారిని కాపాడాలంటూ ఇటీవల తొట్టంబేడు మండల టీడీపీ బీసీ విభాగం అధ్యక్షులు సురేంద్రబాబు యాదవ్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు స్పందించిన తహశీల్దార్ మధుసూదన్ రావు మంగళవారం మండల సర్వే బృందాన్ని చోడవరంకు పంపి శ్మశాన దారిపై సమగ్ర సర్వే చేయించారు. దారి పొడవునా హద్దు రాళ్లు నాటించారు. 1948 నుంచి శ్మశాన దారిగా వినియోగంలో ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉందని సర్వేయర్ హరి తెలిపారు. 3 అడుగుల మేర ఉన్న ఈ దారిని రైతులు క్రమంగా అనుభవంలోకి తెచ్చుకున్నట్లుగా తెలుస్తోందని అన్నారు. ఇకపై ఈ దారిలో ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం

హర్షం వ్యక్తం చేసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్థానికులకు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం పునరుద్ధరిస్తూ టిటిడి పాలకమండలి తీర్మానం చేయడం పట్ల ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. స్థానికులకు నెలలో మొదటి మంగళవారం దర్శనం కల్పిస్తామని ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీని టిటిడి పాలకమండలి తొలి సమావేశంలోనే నెరవేర్చడం పట్ల సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, టిటిడి ఛైర్మన్, సభ్యులు, అధికారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం శ్రీవారి దర్శన టికెట్స్‌ను అమ్ముకోవడానికి స్థానికుల దర్శన భాగ్యాన్ని రద్దు చేసిందని ఆయన ఆరోపించారు. ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానికులకు నెలనెలా శ్రీవారి దర్శన భాగ్యాన్ని పునరుద్ధరించాలని సిఎం, డిప్యూటీ సీఎంలకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

బాబు, పవన్‌కు పాలాభిషేకం చేసిన జనసేన

తిరుపతి సిటీ: స్థానికులకు శ్రీవారి దర్శనం పునరుద్ధరిస్తూ టిటిడి పాలకమండలి నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ జనసేన పార్టీ ఎన్డీఏ నేతలకు పాలాభిషేకం చేశారు. మంగళవారం నాలుగు కాళ్ళమండపం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టిటిడి బోర్డ్ ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. స్థానికులకు శ్రీవారి దర్శనం పునర్ధరిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీ అమలులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేసిన కృషి అభినందనీయమని జనసేన నాయకులు కొనియాడారు. జనసేన నాయకులు హరిశంకర్, కార్పోరేటర్ వరికుంట్ల నారాయణ, మధుబాబు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, బాబ్జీ, రాజేష్ ఆచ్చారి, సుభాషిణి, సునీల్ చక్రవర్తి, అశోక్, మునస్వామి, కెఎంకె లోకేష్, హేమంత్, వినోద్ రాయల్ పాల్గొన్నారు.

16 మంది నిరుద్యోగులకు ఉపాధి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

సిడాప్, డిఆర్‌డిఏ ఫ్యూషన్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో రిలేషన్ షిప్ ఆఫీసర్ ఉద్యోగాలకు మంగళవారం తిరుపతి పరిధిలోని టీటీడీసీ ప్రాంగణంలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 16 మంది ఎంపికైనట్లు డిఆర్‌డిఏ పీడీ శోభన్ బాబు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 80 మంది హాజరు కాగా 16 మంది అర్హత సాధించారని అన్నారు. యువత తమ నైపుణ్యాభివృద్ధిని పెంచుకొని మంచి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిడాప్ జేడీ సరితారెడ్డి సూచించారు. తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న పరిశ్రమలకు కావలసిన నైపుణ్యంతో కూడిన మానవ వనరులను అందించడమే లక్ష్యంగా సీడాప్, డిఆర్‌డిఏ సంయుక్తంగా కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఫ్యూషన్ ఫైనాన్స్ లిమిటెడ్ స్టేట్ హెడ్ అనిల్, సిడాప్ సిబ్బంది యుగంధర్ బాబు, కృష్ణయ్య, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ

వేదాచార్యులకు విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి- క్యాంపస్ : శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయ వేదాచార్యులకు విశిష్ట పురస్కారం లభించింది. భారత ప్రభుత్వ శిక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మహర్షి సాందీపని రాష్ట్రీయ వేదవిద్య ప్రతిష్ఠాన్ ఉజ్జయిని, దేవస్థలి శోధసంస్థ, శ్రీ మహేశ్వరానంద సాంగ వేద సంస్కృత విద్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో హరిద్వార్‌లో నిర్వహించిన అఖిల భారతీయ వైదిక సమ్మేళనంలో వేద విశ్వవిద్యాలయ ఋగ్వేద ఆచార్యులు డాక్టర్ వి.గణేష ప్రసాద్ భట్ ఘనాపాఠికి ఋగ్వేదములో విశేషమైన కృషిచేసి అనేకమంది విద్యార్థులని శాస్త్ర పండితులుగా తీర్చిదిద్దినందుకు గాను వారి సేవలను గుర్తించి "విశిష్ట విద్వత్ సమ్మాన్" అనే బిరుదుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను విశ్వవిద్యాలయ ఉప కులపతులు ఆచార్య రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ రాధా గోవింద త్రిపాఠి,డీన్స్ హెడ్స్, ఆచార్యులు అభినందనలు తెలిపారు.

గణిత స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

మాట్లాడుతున్న సెక్టోరల్ అధికారులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బుచ్చినాయుడు కండ్రిగ, పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన గణిత స్కూలు కాంప్లెక్స్ సమావేశానికి తిరుపతి జిల్లా సెక్టోరల్ అధికారులు రామచంద్రారెడ్డి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్, చంద్రశేఖర్ రెడ్డి, ఏకౌ కోఆర్డినేటర్ విచ్చేశారు. జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ గణితాన్ని ప్రస్తుత తరుణంలో అందుబాటులో ఉన్న సాంకేతికత వినియోగించుకొని విద్యార్థులకు గణిత పట్ల ఆసక్తిని కలిగేలా బోధించాలని విద్యార్థులు గణిత మెళకువలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి కేంద్ర ప్రభుత్వం ద్వారా సూచించిన అపార్ జనరేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. తిరుపతి జిల్లా కో ఆర్డినేటర్ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రశ్న యాప్ లో సర్వే అంశాలను పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు. ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం కల్పించే వివిధ సౌకర్యాలను వివరించారు. మండల కేంద్రంలో ప్రత్యేక ప్రతిభా వంతులకు నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు గమళ్లపాలెం వద్ద మై ఫ్రెండ్స్ అసోసియేషన్ వృద్ధాశ్రమ వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. డాక్టర్ శరత్ చంద్ర పుట్టిన రోజు సందర్భంగా ఆయన కుటుంబ సభ్యుల దాతృత్వ వ్యవహరించారు. ఈ సందర్భంగా జెవివి ఉపాధ్యక్షులు చెంచు నారాయణ మాట్లాడుతూ శరత్‌చంద్ర ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడని అతని పుట్టిన రోజు సందర్భంగా మై ఫ్రెండ్స్ అసోసియేషన్ వృద్ధాశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. తమ సొంత సంస్థ జనవిజ్ఞాన వేదిక ద్వారా ఈ కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చెంచు నారాయణ, పురుషోత్తమ రావు, గుర్రం విజయబాబు, ఇబ్రహీం, ఆశ్రమ నిర్వాహకులు రమేష్ పాల్గొన్నారు.

25న కార్తీక కోటి దీప మహోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి, హిందూ ధర్మ పరిషత్ సహకారంతో తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి సోమవారం 25వ తేదీ తిరుపతి రామచంద్ర పుష్కరిణి వద్ద కార్తీక కోటి దీప మహోత్సవం చేపడుతున్నట్లు సొసైటీ ఛైర్మన్ ఎం విజయగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా లోక కళ్యాణార్థం కోటి దీప మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఈ ఏడు కూడా కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షులు వైఎస్ బాబు, కార్యదర్శి సీతారెడ్డి శేషగిరిరావు, కోశాధికారి ప్రసాదరావు, బుచ్చిబాబు నాయుడు, సుబ్రహ్మణ్యం, శాంతాజాణి, మేరి జాయ్, అనసూయ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యాలయానికి గ్రంథాలయం ప్రాణం వంటిది

ఉత్తమ పాఠక విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యాలయానికి గ్రంథాలయం ప్రాణం వంటిదని ప్రముఖ రచయిత ఆరెస్ కృష్ణస్వామి రాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రచయిత ఆరెస్ కృష్ణస్వామిరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్సు చదివితే విజ్ఞానం, పుస్తకాలు చదివితే సంస్కారం వస్తుందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి మాట్లాడుతూ పుస్తకాలు చదవడం తగ్గడం వల్ల సమాజంలో నేరాలు పెరుగుతున్నాయన్నారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా 'ఉత్తమ పాఠకులు' గా గుర్తించిన విద్యార్థినీవిద్యార్థులకు బహుమతులు అందించారు. ముఖ్య అతిథి ఆరెస్ కృష్ణస్వామి రాజును శాలువ, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డాక్టర్ యం శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ వి వీరయ్య, టి నరసింహులు, మన్యం నరసింహులు, ఎ నాగేశ్వరరావు, డాక్టర్ కె శ్రీదేవి, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ సిబిపియ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా?' ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై దొరవారిసత్రం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్ట్ మేనేజర్ కె బాలాజీ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి కారణాలు, ఎలా వ్యాపించును, వాటి లక్షణాలు, అవి రాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి? వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ బి పార్వతి, ఎఎన్ఎం డి సుమతి, ఓఆర్‌డబ్ల్యు వి ఐశ్వర్య, ఎయన్ఎమ్ కె వెన్నెల, పిఐ డి నాగార్జునమ్మ, వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 13 మంది ప్రజలకు నవజీవన్ సంస్థ ఎఎన్ఎం ద్వారా హెచ్ఐవి పరీక్షలు చేయించి వారి స్థితిని తెలిపారు.

26న మహా ధర్నాను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య

ప్రజాశక్తి - వెంకటగిరి: ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య పిలుపునిచ్చారు. అంగన్వాడీ సమావేశం వెంకటగిరిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, ఏ మంజుల మాట్లాడుతూ అంగన్‌వాడీలు పెండింగ్ డిమాండ్ చేస్తూ నవంబర్ 26వ తేదీ తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని అంగన్వాడీలందరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వెంకటగిరి మండల అధ్యక్షులు వి సుభాషిని, సెక్టార్ లీడర్స్ ప్రాజెక్ట్ లీడర్స్ అంగన్వాడీ టీచర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26వ తేదీ తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను యావత్ రైతాంగం కదలి వచ్చి విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. రైతు సోదరుల పంటలకు సరైన మద్దతు ధర, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు పంట రుణమాఫీ, పంటల బీమా, ఆత్మహత్యలు పాల్పడుతున్న రైతులకు బీమా, వ్యవసాయ కార్మికులకు, కౌలు రైతులకు పెన్షన్, ల్యాండ్ లీజ్ యాక్ట్ భూ యజమాని సంతకం ఉండాలనే నిబంధన తొలగించాలని, వ్యవసాయ రంగంలో కార్పొరేట్ వ్యవస్థను నిర్మూలించాలని ఇలా అనేక రకాల సమస్య లపై గళ మెత్తాలని ఏపీ రైతు సంఘం నాయకులు ఏర్పేడు మండలంలోని ఇసుకరు, బండారి పల్లి, వెంకటాపాలెం, పరమాలపల్లె గ్రామాలలో మంగళ వారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు రైతు సంఘం నాయకులు రంగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ క్యాంపులు

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: వడమాలపేట మండలంలో ఆధార్ స్పెషల్ క్యాంపులు ఈ నెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల వడమాల పేటలో నిర్వహిస్తున్నట్లు వడమాల పేట ఎంపిడిఓ శేఖరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో ఏదైనా సవరణ చేసుకోవాలన్నా, కొత్తగా నమోదు చేసుకోవాలన్నా ఈ కార్యక్రమాన్ని మండలంలోని అందరూ గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'టిడిపితోనే ఆదరణ'


వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర రాజకీయ చరిత్రలో టిడిపి ఆవిర్భవించిన తర్వాతే వన్నె కులానికి ఆదరణ లభించిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమి తులైన సిఆర్ రాజన్, డైరెక్టర్ మిన్నల్ రవి అన్నారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియ మితులైన సిఆర్‌రాజన్‌ను, డైరెక్టర్లు మిన్నల్ రవి, బాలసుబ్రహ్మణ్యంలను మంగళవారం టిడిపి బిసి విభాగం నాయకులు ఘనంగా సత్కరించారు. బాలాజీ రెడ్డి, యందసిరెడ్డి, చంద్రారెడ్డి, మణికంఠ పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఎన్ఎంఆర్, డైలీ వేజ్ ఉద్యోగుల వేతనాలు పెంపు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మినిమం వేజ్ (కనీస జీతాలు) అమలు చేయడంతో ఎన్ఎంఆర్, డైలీ వేజ్ ఉద్యోగులకు సుమారుగా నెలకు వెయ్యి రూపాయలు జీతం పెరిగింది. తిరుపతి కలెక్టర్, మెజిస్ట్రేట్ మినిమం వేజ్ ఉండాలని వర్సిటీకి లేఖ రాయడంతో ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రారు ఆచార్య మాదాల భూపతి నాయుడు, వర్సిటీ ప్రిన్సిపాల్స్, వర్సిటీ ఫైనాన్స్ అధికారి, నాన్ టీచింగ్ అధికారి నర్సింహులు, ఇతర ఉన్నత అధికారులు కలెక్టర్ ఆదేశాలపై చర్చించి 'మినిమం వేజ్' అమలు చేసి జీతాలు పెంచాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదన 2024 ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తుందని, తద్వారా వారికి సుమారు ఏడువేల రూపాయలు అరియర్స్ లభిస్తుందని రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలిపారు. ప్రస్తుతం దీనిపై వర్సిటీ ఉపకులపతి ఆదేశాలు జారీ చేశారు. దీని ద్వారా ఎన్ఎంఆర్‌లు, డైలీ వేజ్ ఉద్యోగులు అందరికీ సుమారు వెయ్యి రూపాయలు జీతం పెరిగినట్లు అయింది. జీతాల విషయంలో మినిమం వేజ్ అమలు చేయడంతో డైలీ వేజ్, ఎన్ఎంఆర్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

వర్సిటీలో రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహణ

యూనివర్సిటీ అధికారులతో చర్చిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

వర్సిటీలో రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో క్రీడల, క్రీడా వసతుల అభివృద్ధికి వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడులతో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణపై శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు వర్సిటీ ఉపకులపతి చాంబర్‌లో మంగళవారం చర్చించారు. వర్సిటీలో క్రీడా వసతులు, నూతన ఆటస్థలం అభివృద్ధికి ఖేలో ఇండియా కేంద్ర సంస్థకు ప్రతిపాదనలను పంపింది. వాటిని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ సంస్థ శాప్ ఛైర్మన్ రవి నాయుడును ఈ సందర్భంగా కోరింది. ఆయన వర్సిటీ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, తాను కలిసి ఆ నిధులు సాధిస్తామని హామీ ఇచ్చారు. శాప్‌కు చెందిన శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయానికి వచ్చే రాష్ట్ర, దేశ స్థాయి క్రీడాకారులకు వసతి సౌకర్యాలను వర్సిటీలో కల్పించాలని అభ్యర్థించారు. అవసరం ఉంటే శాప్ నిధులతో వర్సిటీ సముదాయాలను ఆధునీకరించి క్రీడా సదుపాయాలకు, వర్సిటీ సదుపా యాలకు వినియోగించుకోవచ్చని ప్రతిపాదించారు. త్వరలో వీటిపై ఎంఓయూ చేసుకుంటామని ఇరువర్గాలు తెలిపాయి.

వర్సిటీలో సాంస్కృతిక ఉత్సవాలు యువతరంగ్ -24 ను ఘనంగా నిర్వహించిన వర్సిటీ అధికారులు, నిర్వాహకులనూ అభినందిస్తూ, రాష్ట్ర మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించాలని వర్సిటీకి అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వూక రమేష్, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ, వర్సిటీ ఇంజనీర్ తాండవ కృష్ణ, విద్యార్థి నాయకులు రామ్మోహన్, రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు గుర్తించి కాపాడండి..

- దళిత రైతులకు న్యాయం చేస్తాం..
- సిజెఫ్ఎస్ భూముల పరిశీలనలో ఆర్‌డీవో

భూములను పరిశీలిస్తున్న ఆర్‌డివో రామ్మోహన్

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ప్రభుత్వ భూములను గుర్తించి కాపాడాలని తిరుపతి ఆర్‌డివో రామ్మోహన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చుట్టుగుంట రామాపురం రెవెన్యూ లెక్క దాఖలాలోని సీజేఎఫ్ఎస్(కమ్యూనిటీ జాయింట్ ఫార్మర్స్ సొసైటీ) భూములను తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ పరిశీలించారు. మంగళవారం సి రామాపురంలోని సర్వేనెంబర్ 102 లో ఉన్న 288 ఎకరాల భూమి స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. 102 సర్వే నెంబర్లు రేణుకా దేవి సొసైటీకి (సిజెఎఫ్ఎస్) 141 ఎకరాల భూమిని గతంలో గంగిరెడ్డిపల్లి, మిట్టూరు, సి రామాపురం దళితులకు కేటాయించింది. అన్నా స్వామి గండి చెరువుకు 20 ఎకరాలు, కాలువలు, రహదారులకు 28 ఎకరాలు కేటాయించడం జరిగిందని రెవెన్యూ అధికారులు ఆర్డీవో రామ్మోహన్ కి తెలియజేశారు. ప్రభుత్వ భూమి 58 ఎకరాల ఉన్నట్లు ఆర్డీవో రామ్మోహన్ గుర్తించారు. ఆ భూములను గూగుల్ ద్వారా అన్నా స్వామి గండి చెరువు, సిజెఎఫ్ఎస్ భూములు, రోడ్లు, కాలువలు, ప్రభుత్వ భూములను సర్వే చేసి నివేదికలు సిద్ధం చేయాలని తహశీల్దారు కే వెంకటరమణ, సర్వేయర్ రమేష్ బాబులను ఆదేశించారు. 85 మందికి సంబంధించిన సిజెఎఫ్ఎస్ భూములలో దళిత రైతులు మామిడి సాగు చేసుకుంటూ అనుభవం ఉన్నట్లు ఆయన గుర్తించారు. రేణుకా దేవి సొసైటీ రైతుల భూముల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తారని రైతులకు ఆర్డిఓ హామీ ఇచ్చారు. 102 సర్వే నెంబర్లు ఉన్న 58 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించుకునేందుకు ల్యాండ్ బ్యాంకింగ్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆర్డీవో రామ్మోహన్ ఆదేశించారు. సిజెఎఫ్ఎస్ భూములలో ఏడు ఎకరాల భూమి లో ఇంటి స్థలాలు లేని రేణుక సొసైటీ రైతులకు ఇంటి పట్టాలి ఇవ్వాలని దళితులు ఆర్డీవోను కోరారు. 102 సర్వే నెంబర్ కు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేసి ఇవ్వాలని తహశీల్దారు కే వెంకటరమణ కోరారు. మండలంలో ప్రభుత్వ భూములను దురాక్రమణ కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమణలకు పాల్పడితే వెంటనే వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కే వెంకటరమణ, సర్వేయర్లు రమేష్ బాబు, మణి, వీఆర్వో ఝాన్సీ రాణి, రైతులు లోకనాథం, వెంకటాద్రి, గోవిందస్వామి పాల్గొన్నారు.

ముగిసిన పద్మనాభ ఆర్ట్స్ అకాడమీ నాటకోత్సవాలు

నాటకోత్సవాల ముగింపు సభకు హాజరైన ముఖ్య అతిథులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: స్థానిక టిటిడి మహతి కళాక్షేత్రంలో శ్రీ పద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైనాన్స్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటకోత్సవాలు చివరి రోజు మంగళవారం ముగిశాయి. టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ , రోటరీ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన నాటకోత్సవాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ నేటి ఆధునిక జనరేషన్, స్పీడ్ యుగంలో నాటకాలకు ఊపిరి పోస్తున్న నాటకోత్సవాలు, అధినేతలలో పేరుగాంచిన కస్మా పద్మనాభం ఆయన సొంత నిధులతో 20వ నాటకోత్సవాలను రెండు దశాబ్దాలుగా నిర్వహించడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. ఈ నాటకోత్సవాలలో ముందుండి పర్యవేక్షించిన కస్మా పద్మ నాభం సామ్రాజ్యం, సీనియర్ కళాకారులు మర్థం గజేంద్ర, మోహన్ రెడ్డి, జనసేన నాయకురాలు భాగవతుల జయలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు..

దుకాణదారులను హెచ్చరిస్తున్న మున్సిపల్, ఆలయ, పోలీసు అధికారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా సన్నిధి వీధి ప్రజలు, దుకాణదారులు నడుచుకోవాలని పోలీస్, మున్సిపల్, ఆలయాధికారులు సూచించారు. మంగళవారం సన్నిధి వీధి జల వినాయకుడి నుంచి భరద్వాజ తీర్థం రోడ్డు వరకు అధికారులు పర్యటించారు. రోడ్డు కిరువైపులా దుకాణాలు నడుపుతున్న వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సమీపిస్తున్న వేళ మరింత బాధ్యతగా వ్యవహరించాలని దుకాణాలు రోడ్డులోకి చొచ్చుకురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, వన్ టౌన్ సీఐ గోపి పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగి పడ్డ భారీ చెట్టు

- స్తంభించిన ట్రాఫిక్
- తొలగించిన పోలీసులు

రోడ్డుపై విరిగి పడిన రావి చెట్టు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): మండలంలోని శ్రీనివాస మంగాపురంలో కనకదుర్గ ఆలయ ఆవరణలో ఉన్న భారీ రావి చెట్టు మంగళవారం విరిగి తిరుపతి –భాకరాపేట రోడ్డుపై పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ స్తంభించింది. ఆ సమయంలో ఆ రోడ్డున ఎలాంటి వాహనాలు రాకపోవడంతో, రోడ్డుపై ఎవరూ లేక పోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. స్థానికులు రోడ్డుపై పడిన రావి చెట్టు కొమ్మలను తొలగించడానికి వీలు కాకపోవడంతో గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో స్థానికులు చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇవ్వగానే సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ సింగంశెట్టి అనిత, పోలీసు సిబ్బంది స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని భారీ రావి చెట్టు దుంగలను యంత్రాలతో కత్తిరించి జెసిబి సాయంతో రోడ్డుకు అడ్డం లేకుండా తొలగించారు. వాహనాల రాకపోకలకు అనుమతించారు. చంద్రగిరి పోలీసులు చొరవతో రావి చెట్టు దుంగలను రోడ్డుకు అడ్డంగా లేకుండా తొలగించడంతో వాహన చోదకులు, ప్రజలు, చంద్రగిరి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న నిఘా అధికారిణి హరిత

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిఘా అధికారిణి డాక్టర్ హరిత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె ఆరోగ్య కేంద్రంలోని లేబరేటరీ, కాన్పుల గది, వ్యాక్సిన్ నిల్వవించిన గదిని పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. వార్డులో కాన్పుకు వచ్చిన గర్భిణీతో ఆరోగ్య విషయాలు చర్చించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, పలు రకాల పరీక్షలు, గురించి వైద్యుల నుండి సమాచారం రాబట్టారు. వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ చైతన్య, చంద్రకళ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాలపై ఉక్కుపాదం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం నుండి జిల్లా వ్యాప్తంగా చట్టవిరుద్ధ కార్యక్రమాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టి మత్తు పదార్థాల నిర్మూలనే ధ్యేయంగా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం రైల్వే స్టేషన్ బస్టాండ్ పార్సిల్ ఆఫీసుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలకు తావులేదని ఎట్టి పరిస్థితిలో కూడా ఉపేక్షించేది లేదని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి చట్ట విరుద్ధ కార్యక్రమాలను నిర్వహించాలని, చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలను అరికట్టాలంటే ప్రజల నుండి సహకారం ఎంతైనా అవసరమని.. ఏదైనా సమాచారం ఉంటే దగ్గర ఉన్న పోలీస్ వారికి లేదా డైల్ 112 లేదా వాట్సప్ నెంబర్ 80999 99977 కి సమాచారం అందించాలని పోలీసులు కోరారు, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా వుంచుతామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఎస్వీయూలో ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం వ్యవస్థాపకురాలు, భారతదేశ మొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున, జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, యూనివర్సిటీ నాయకుడు బాలు నాయక్, శ్రీకాంత్ , దేవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: ఇందిరాగాంధీ ఉక్కు మహిళగా పేరు ఖ్యాతించారని మహిళా అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని ఖజానా అధికారి ఇందిరా గౌరీ ముఖ్యఅతిథి శోభారాణి తెలిపారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా మంగళ వారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా చర్చ గోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమములో గ్రంథాలయ సిబ్బంది కే సునీల్‌బాబు, అసిస్టెంట్ లైబ్రేరియన్ గ్రేడ్ 1, టి ప్రతాప్ రెడ్డి, భారతి ఎల్ మనిగండన్, వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థినులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని తిరుపతి మున్సిపల్ కార్యాలయ కూడలి వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం ముందు తిరుపతి కాంగ్రెస్ శ్రేణులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తిరుపతి పట్టణ అధ్యక్షులు చిట్టిబాబు ఆమె అందించిన సేవలను కొనియాడారు.

చింతామోహన్ ఆధ్వర్యంలో..

మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పాకిస్తాన్ పై యుద్ధం ప్రకటించి, దేశ విచ్ఛిన్న పరిస్థితులను చక్కదిద్దిన గొప్ప వ్యక్తి ఇందిరా గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు రాం భూపాల్ రెడ్డి, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ బాధ్యులు మాంగాటి గోపాల్ రెడ్డి, తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి ఐరాల లోకేష్, శివశంకర్, సింధుజ, తమటం వెంకట నరసింహులు, స్వరూప్ నాయక్, గోపి, మల్లికార్జున, శివ బాలాజీ, మోహన్, నరేంద్ర పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రెండు వేర్వేరు కేసుల్లో నలుగురు స్మగ్లర్లు అరెస్టు

35 ఎర్రచందనం దుంగలు, వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రెండు వేర్వేరు ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో నలుగురు ఎర్ర చందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుండి 35 ఎర్రచందనం దుంగలు, కారు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టడంలో భాగంగా ప్రత్యేక కార్యచరణ అమలు చేయడంతో మంచి ఫలితాలు వస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాలతో డీఎస్పీ జి బాలిరెడ్డి మార్గనిర్దేశంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక బృందాలకు అందిన విశ్వసనీయ సమాచారంతో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు లింగాధర్, విష్ణువర్ధన్ కుమార్ బృందాలు ఏర్పేడు మండలం చింతలపాలెం చెక్ పోస్ట్ వద్ద నిఘా ఉంచగా ఈ మార్గంలో ముగ్గురు వ్యక్తులు వాహనంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నట్లుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందాలు చంద్రగిరి మండలం పాతపాటివారి పల్లి గ్రామ సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ వద్ద కొంతమంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని 25 ఎర్రచందనం దుంగలను, ఒక లారీని స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. ఈ రెండు వేర్వేరు ఘటనల్లో పట్టుబడిన మొదటి ముగ్గురు వ్యక్తులు తమిళనాడుకు చెందిన వారని, రెండో ఘటనలో పట్టుబడిన వ్యక్తి కర్ణాటకకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. ఈ ఎర్రచందనం అక్రమ రవాణా వెనుక ఉన్న స్మగ్లర్లను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఎస్పి శ్రీనివాస్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న సిబ్బందికి టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారులు రివార్డులు ప్రకటించారు.

ప్రమాద వశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని తిప్పవరపుపాడు గ్రామంలోని ఏటి కాలువలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమాద వశాత్తు పడి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. తిప్పవరప్పడు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం (50)కు మూర్ఛ వ్యాధి వుందని గ్రామస్తులు తెలిపారు. ఏటి గట్టు దాటుతున్న సమయంలో ప్రమాద వశాత్తు జారిపడి పోయి ఉండవచ్చు స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆటో ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. బాలాయపల్లి మండలానికి చెందిన అల్లం ఈశ్వరయ్య(60) గేదెల కోసం వెతుక్కుంటూ గొల్లపల్లి రోడ్డులో వస్తుండగా వెంకటగిరి నుండి గూడూరు వైపు వెళుతున్న ఆటో వెనుక వైపు నుండి ఢీ కొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడని పేర్కొన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్ : ఏర్పేడు రైల్వే స్టేషన్ సమీపంలో హిందీ మాట్లాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. నవంబర్ 18 సాయంత్రం 7 గంటల పైన ఆ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లుగా రేణిగుంట రైల్వే పోలీసులు తెలిపారు. రేణిగుంట రైల్వే ఎస్ఐ కె రవి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అపార్టుమెంటులో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నగరంలోని బాలాజీ కాలనీలోని ఓ అపార్టుమెంటులో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జ్యోతిరావు పూలే సర్కిల్ సమీపంలో ఓ అపార్టుమెంటులోని ఆరవ అంతస్థులో తాళం వేసిన ఇంటి నుంచి పొగలు రావడంతో , స్థానికులు, అపార్టు మెంటు వాచ్‌మ్యాన్ గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎనిమిది లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారి అంచనా వేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిటిడి బోర్డు నిర్ణయాలు హర్షణీయం: జనసేన

మాట్లాడుతున్న జనసేన నాయకులు కిరణ్‌రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి ధర్మకర్త ల మండలి నిర్ణయాలు హర్షణీయ మని జనసేన తిరుపతి అసెంబ్లీ ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన ఆధ్వర్యంలో గతంలో చోటు చేసుకున్న అక్రమాలు విశాఖ శారద పీఠం మఠం అక్రమ నిర్మాణం, టూరిజం ద్వారా తిరుమల శ్రీవారి దర్శనాలలో చోటు చేసుకున్న అవినీతిని ఇటు టిటిడికి, అటు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఆధారాలతో ఫిర్యాదు చేశామన్నారు. దీంతో సోమవారం తిరుమలలో నిర్వహించిన బోర్డు సమావేశంలో వాటిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. టూరిజం శాఖలో రూ.400 కోట్ల అవినీతి వుందని, దీనిపై త్వరలో సీఐడీ విచారణ ప్రారంభం అవుతుందన్నారు. తప్పకుండా దోషులకు తగిన శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం చొరవ చూపిస్తుందన్నారు. తిరుమలలో అన్యమతస్థులను ప్రత్యేక కమిటీ వేసి వారిని వేరొక ప్రభుత్వ విభాగాలకు డిప్యూటేషన్‌పై పంపే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఆకేపాటి సుభాషిణి, సుమంత్, బాలాజీ, ముని, లోకేష్ పాల్గొన్నారు.

బి ఫార్మసీ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

మాట్లాడుతున్న ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో బి ఫార్మసీ కోర్సు చేయడానికి దాదాపు లక్ష మంది విద్యార్థులు ఎదురు చూస్తు న్నా ప్రభుత్వం కౌన్సెలింగ్ నిర్వహించ కుండా నిర్లక్ష్యం చేయడం తగదని, వెంటనే విద్యార్థుల భవిష్యత్తులో దృష్టిలో ఉంచుకొని వెంటనే కౌన్సెలింగ్‌కు ఉత్తర్వులు జారీ చేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లవరపు అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 135 ఫార్మసీ కళాశాలలు ఉన్నాయని, కాని ప్రభుత్వం 90 కళాశా లలకు మాత్రమే జీవో విడుదల చేసిందని, కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించలేదన్నారు. విద్యా సంవత్సరం కోల్పోతున్న బి ఫార్మసీ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మంత్రి లోకేష్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలటో దుర్గం నాని, విజయ కుమార్, చల్లా శేషు, మునికుమార్, గౌతమ్, సాయిప్రకాష్ పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మహిళల చట్టాలపై పుత్తూరు గ్రంథాలయ శాఖాధికారి మీనాకుమారి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చట్టాలు తీసుకొచ్చిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు తీసుకొచ్చారని, మహిళా కమిషన్ ఏర్పాటు చేశారని మహిళలకు ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత శాఖకు తెలపాలని సూచించారు. అలాంటి వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రంథాలయ శాఖ సిబ్బంది సుజాత, పాల్గొన్నారు.

భూసార పరీక్షా పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలోని రైతులకు మండల వ్యవసాయ అధికారి వి నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో భూసార పరీక్షా పత్రాలను మంగళవారం అందించారు. వీటి ఆధారంగా సిఫార్సు చేసిన మేరకు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను వేయాలని రైతులకు అవగాహన కల్పించారు. వరి నారుమడిలో కలుపు యాజమాన్య పద్ధతులుపై అవగాహన కల్పించారు. సబ్సిడీలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి డి.సాయికుమార్ పాల్గొన్నారు.

నేను దత్త భక్తుడిని మాత్రమే..

కాకి హరిబాబు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'నేను దత్త భక్తుడిని మాత్రమే.. పరిశ్రమల రాకతో ఆలయానికి ఏర్పడిన ఇబ్బందిని తొలగించడానికి కోర్టుకు వెళ్లాను..ఆలయానికి 50 సెంట్ల భూమిని కేటాయిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.. ఈ తీర్పును కూడా వక్రీకరిస్తూ కొంత మంది గుడి పరివార సభ్యులుగా చెప్పుకుంటూ నాపై చేసిన ఆరోపణలు ఖండిస్తున్నాను..' అంటూ దత్త భక్తుడు కాకి హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయాన్ని రౌతు సూరమాల గ్రామానికి అప్పగించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. పెద్దలు నిర్ణయం మేరకు వారు ఎవరినైనా ఆలయంలో పూజారిని నియమించుకోవచ్చని తాను దత్త భక్తుడుగా ఆలయానికి వచ్చి పూజలు చేసుకుంటానని తెలిపారు. భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు.